# భవభూతికవి-ఆయనచిత్రచరిత్ర

శ్రీ వేదము వెంకటరాయశాస్త్రి

‘ఏమండోయి జాతూకర్ణమ్మగారూ, మీ అల్లుడుగారికి ఒక కన్ను లేదే !’

‘లేకపోతే నేమమ్మా, మహాపండితుడు, పనివాడైనా’

‘పండితుడే. కాని మీ అమ్మాయి ఒప్పుకుందా’

‘భేషుగ్గా; వరించి చేసుకుంది మా శ్రీదేవి’

‘అలాగా !’

‘బావేగా. పైగా పాపం, ఆ కన్ను ఈ నడమే పోయింది. మునుపు బాగుండేది చూడు ఎంత ఎఱుపు! ఆ ముక్కు, మొహం, పొడుగు, తేజస్సు! ఆజానుబాహువు మనిషి. సాముద్రికంలో చెప్పే మహాపురుష లక్షణా లన్నీ ఉన్నాయి.’

‘సరే, కలిసివచ్చిన సంబంధం గావును. పైగా బావ. అంచేత చిన్నప్పటి సహవాసం ప్రేమగా మారి కన్నొకటి పోయినా మీ అమ్మాయి కోర పెళ్లి చేసుకుంది.’

‘మా అమ్మాయి కావ్యశాస్త్రాలు కాస్త చదువుకుంది. అంచేత చదివిన బావంటే దానికి అంత గురుత్వం’ అన్నది తల్లి జాతూకర్ణీ దేవి.

ఈ మెభర్త నీలకంఠుడు. మహావిద్వాంసుడైన భట్టశ్రీ నీలకంఠుడని వ్యవహారము. దక్షిణాపథమున విదర్భదేశమున పద్మపురమున (నేటి బీరారు) ఉదుంబరు లను తెగ బ్రాహ్మణులు, తైత్తిరీయులు, చరణగురువులు, పంక్తిపావనులు, ధృతవ్రతులు, సోమయాజులు ఉండిరి. ఆ తెగలో కాశ్యపగోత్రమునందు కృష్ణయజుశ్శాఖాధ్యాయి, మహాకవి యనుపేరివాడు వాజపేయయాజి యుండెను. అతని మనుమడు భట్టగోపాలుడు చాల ప్రసిద్ధి నందియుండెను. ఈతని కుమారుడే పై నీలకంఠుడు. ఈతడు పండితుడై జాతూకర్ణి యనునామెను వివాహమాడెను. వీరికి శ్రీదేవి యను కొమార్తెయు, శ్రీకంఠుడను కుమారుడును జనించిరి. ఈ శ్రీదేవికే నేడు వివాహము.

అల్లుని పేరు కుమారిలస్వామి. ఆంధ్రదేశమునకును ఉత్కళమునకును నడుమ మహానదీతీరమున జయమంగల మను గ్రామము కలదు. అందు తైత్తిరీయశాఖకు చెందినవాడు యోగీశ్వరభట్టనునత డుండెను. ఆయనభార్య చంద్రగుణ. వీరికి చిరకాలము లేకలేక కుమారస్వామివరమున నీతడు జనించినందున కుమారిలస్వామి యని నామకరణ మొనరించిరి. చంద్రగుణ నీలకంఠునికి అక్కవరుస. బాల్యమునుండియు రాకపోకలవలన శ్రీదేవికి కుమారిలస్వామి యనిన చాల ప్రియము. సౌందర్యమున మన్మథుడే.

కుమారిలుడు బాల్యమునుండియు మేధావంతుడు. వేదవేదాంగములను నేర్చినంతట ఇతనికి జైనమతముపై నీర్ష్య జనించినది. దానిని ఖండించి వైదికమతమును దేశమందు పునరుద్ధరింపవలయు నను నభిలాష కలిగినది. కాని జైనులు తమ మతరహస్యములను ఇతరులకు చెప్పరు, గ్రంథములను చూపరు. వానిని గ్రహించిన గాని ఖండించుట సాధ్యపడదు. జిజ్ఞాసువు, అభిమాని కుమారిలుడు కౌమారముననే ఇల్లు వదలెను. విద్యాగ్రహణార్థము సంచారము మొదలిడెను. జైనమతమును నిర్మూలించువఱకును అతని యాత్మకు శాంతి యేది ?

శ్రీదేవి కీ విషయము తెలిసినది. కుమారిలస్వామి మహాప్రతిభావంతు డని యెఱుగును. తలిదండ్రులు వివాహప్రయత్నములు చేయగా నివారించెను. తన స్వామి కుమారిలస్వామియే యనెను. ఆతడో దేశాంతర మేగినాడు. కాని వచ్చువఱకును ఉండవలసినదే యని పట్టుపట్టెను.

కుమారిలుడు దేశసంచార మారంభించెను. నాడు దేశమున మతకలహములకు లెక్క లేదు. అవైదికమతము వైదికకాలమునుండియు కలదు. దేహాత్మవాద మనునది యొకటి ఉపనిషత్తులలోనే కనబడుచున్నది. ఈ వాదము క్రమముగా ప్రబలినది. ఈమతమువారిని తీర్థంకరులనియు, జైనులనియు వ్యవహరింపసాగిరి. ఈపరంపరలో ఇరువదినలువురు తీర్థంకరులు వెలసిరి. కడపటివాడగు మహావీరజైనుడు క్రీ. పూ. ఆఱవ శతాబ్దమువాడు, బుద్ధుని సమకాలికుడు. ఈతని మతము సామాన్యజనులకు అనుకూలముగా నుండినందున చాల త్వరగా బీహారుదేశమందును, అటనుండి కళింగాంధ్రములకును వ్యాపించినది. చంద్రగుప్తచక్రవర్తి కాలముననే మైసూరువఱకును వ్యాపించినది. తమిళదేశమున సంఘకాలమున, అనగా క్రీ. పూ. ౩౦౦ లప్పుడు ప్రాధాన్యము నందినది. కుమారిలస్వామికాలమునకు జైనమతము ఆంధ్రద్రావిడకర్ణాటకదేశములలో మహోన్నతస్థితియం దుండెను. ఆంధ్రకళింగదేశములలో బౌద్ధజైనవిహారములు చిరకాలముగా నిర్మితము లగుచుండినవి. వైదికమతము నామమాత్రావశిష్టమై యుండెను. వైదికమతానుయాయులు నిక్షేపములవలె ఎచ్చటెచ్చటనో దాగియుండిరి. అట్టివానినుండి, నివురుగప్పిన నిప్పు, కుమారిలుడు ఎనిమిదవశతాబ్దప్రారంభకాలమున బయలుదేరెను.

అతడు జైనబ్రహ్మచారివేషము ధరించెను. జైనగురువులకడకు పోయెను. వారి రహస్యముల నెన్నింటినో గ్రహించెను. తుదకు జైనవిద్యాపారంగతుడాయెను. కాని ఈతని తోడివిద్యార్థి యొకడు మొదటినుండియు ఈతనిపై గంటువహించియుండెను. ఒకదినము కుమారిలు డుండగా నలువురయెదుట వైదికమతమును చాల నిరసించెను. ఓర్వరాని కటువాక్యములను ప్రయోగించెను. సముద్రమువలె గంభీరుడు, భూదేవివలె క్షమావంతుడు, చాణక్యునికన్న నయతంత్రజ్ఞుడు కుమారిలుడు; కాని ఓర్వలేకపోయెను. పొంగివచ్చు దుఃఖాతిరేకమున నాతని నేత్రములనుండి బాష్పములు అతని వశములేకయే జొటజొట రాలినవి. తక్షణమే ఆ విద్యార్థి కుమారిలుని రహస్యమును బైటవేసెను. జీవకారుణ్యమే పరమావధియైన జైనమతమును బోధించు నా విద్యార్థియు, తదితరజైనులును నాలుగంతస్తుల మేడమీదినుండి కుమారిలుని క్రిందికి త్రోసిరి. పడుటలో కుమారిలునికి మంచిదెబ్బలే తగిలినవి; కన్నొకటి పూర్తిగా పోయినది.

ఎవరో తీసికొనిపోయి కాపాడిరి. ఇకను విద్యాభ్యాసము పూర్తియైనదని యాతడు తండ్రికడకు పోయెను. తండ్రి పరమానందమును జెందెను. తల్లి ఆ కంటిని తాకితాకి దుఃఖించెను. 'నాయనా, నీకోసం పాపం, ఆ శ్రీదేవి కాచుకొనిఉన్నదిరా' అనెను. కుమారిలునికి ఆశ్చర్యసంతోషములు కలిగినవి. వెంటనే తల్లిదండ్రులతో పద్మపురమునకు బయలుదేరెను. పరమానందభరితులై జాతూకర్ణి నీలకంఠులు వారిని ఆహ్వానించిరి. కుమారిలుడు మునుపటి కుమారిలుడేగాని ఒక కన్నుమాత్రము లేదు. అందులకు అందఱును చింతించిరి. శ్రీదేవియు చింతించినదిగాని అతడు మరల వచ్చినదే చాలునని సంతోషించినది. ఇంకనేమి, బౌద్ధజైనులను పచ్చడిచేయునని ఆమె నిశ్చయించుకొనెను. రాజసభాంతరములలో తన స్వామిదే విజయమని ఆమె ఊహాసౌధములు నిర్మించుకొనసాగెను.

శుభస్య శీఘ్రమని వివాహప్రయత్నములు జరిగినవి. పెద్దలు బహువైభవముగా వివాహమును జరిపించిరి. దానికి వచ్చిన పెద్దలందఱు ఆ దాంపత్యమునకు సంతోషించినను పెండ్లికొమారునికి కన్నొకటి పోయినదే యని చింతింపనివారు లేరు. అదియే నాటి మాట అందఱినోటను.

౨

కుమారిలస్వామి తల్లిదండ్రులతోను, భార్యతోను జయమంగలమునకు బయలుదేరిపోయెను. శ్రీదేవి పద్మమును వీడిపోవునట్లు ఈ శ్రీదేవి పద్మపురమును వీడిపోవుచుండగా అందఱు చింతించుట ఆశ్చర్యము గాదు గాని పసిబాలుడు శ్రీకంఠుడు చాల నేడ్చెను. వానికి అక్క పెండ్లిలో వడుగుచేసిరి. బాల్యమునుండి తనకు అక్కయే చదువుచెప్పినది. అటువంటి యక్క దేశాంతరమునకు పోవుచున్నది. ఎక్కడి పద్మపురము,

ఎక్కడి జయమంగళము! మరల అక్కను చూచుట ఎప్పుడో! ఏమయిన నేమి? శ్రీకంఠుడు అక్కమీదనే తన మన సుంచియుండెను. ఆతని యుపాధ్యాయుడు జ్ఞాననిధిమహోదయుడు ఓదార్చి, తన యింటికి కొని పోయి వైదికవిద్యల నెల్లను అతిప్రీతితో నేర్పెను. క్రమముగ శ్రీకంఠుడు విద్యావంతుడై భట్టశ్రీకంఠు డాయెను.

శ్రీకంఠుని పెండ్లియాడు. విద్యాభ్యాసము పూర్తియైనంతట తండ్రి బంధువులలో వెదకి యుక్త వయస్కను, తుల్యగుణను, మహావిదుషిని, కుమారిలస్వామి పినతండ్రియైన విష్ణుభట్టాచార్యుని కొమారితను కొని వచ్చి శ్రీకంఠునికి వివాహమొనర్చెను. అమ్మాయిపేరు సరసవాణి. బాల్యమునుండి అలోకసామాన్యప్రతిభను ప్రకటించుచువచ్చినందున ఆమెను బంధువులెల్లరు భారతియవతార మని యనుచుండిరి. సంస్కృత ప్రాకృతములందు కవయిత్రిగావున ఉభయభారతి యని యామెకు ప్రసిద్ధి యేర్పడెను. ఉభయభారతి యను నది క్రమముగా ఉంబగా సంగ్రహింపబడి పుట్టినింట నామెకు ఉంబ యనియే వ్యవహార మేర్పడెను. ఆమెకు ఎట్టి వరుడు దొరకునో యని చింతించుచుండిన తలి దండ్రులకును, బంధువులకును పరమానందకరముగ మహా విద్వాంసుడు శ్రీకంఠుడు దొరకెను. పెండ్లిపందిటి లోనే ఎల్లవారికిని ఆదంపతులలో ఎవరు విద్యాధికులో యను వివాద మేర్పడెను. ఆవిషయము దంపతులే నిర్ణ యించుకొనదగినదని యందఱును వారికే వదలిరి. అను రాగముచే శ్రీకంఠుడును, భర్తృగౌరవముచే ఉంబయు బదులు చెప్పలేదు. ఇట్టి లోకోత్తరపాండిత్యమును, దాంపత్యమును అసాధారణములు.

శ్రీకంఠుని వివాహమునకు ఆతని యక్క శ్రీదేవి రాలేదు. ఆ దేశమునుండి యీ దేశమునకు వచ్చుట చాల ప్రయాసతో కూడిన పని. దారిలో దొంగలగుంపు. పైగా ఏవేవో అడ్డము లేర్పడినవి. సరిగా నప్పుడే శ్రీదేవి లేకలేక గర్భిణిగా నుండెను. పెక్కు కారణములచేత శ్రీదేవీకుమారిలస్వాములు శ్రీ కంఠుని వివాహమునకు రాలేకపోయిరి. అది వారికంద ఱు తీరని కొఱతయే. కాని ప్రాప్తమునకు ఎవ రేమి చేయగలరు?

క్రమముగా ఉంబయు భర్తతోకూడ విద్యా వ్యాసంగమున పండితులతో పాల్గొనసాగెను. శ్రీకంఠు నికిని కాలక్రమమున నాతనిపేరు మఱిగిపోయి ఉంబా భర్తగాన ఉంబేకాచార్యు డని వ్యవహార మేర్పడెను.

పద్మపురము నేటి బీరారునందు కలదు. శ్రీకంఠుని కాలమునకు ఆ దేశము ఆంధ్రదేశమునంద లిదే. నేటికిని తెలుగు మాటలాడువారు ఆ ప్రాంతమున గలరు. శాతవాహనులు పాలించిన దక్షిణాపథము వారి తర్వాత పెక్కు రాజవంశములవారిచే విభక్తమైనది. పశ్చిమమున కదంబులును, వారితర్వాత చాళుక్యులును, దక్షిణమున పల్లవులును, తూర్పున ఇక్ష్వాకుసాలం కాయనవిష్ణుకుండినులును పాలించిరి. శ్రీకంఠుని కాలమున బాదామిచాళుక్య లింకను గలరు. వేంగి యందు చాళుక్యుల యాధిపత్యము ఏర్పడి దాదాపు వందసంవత్సరము లైయుండినది. బీరారువఱకు నేటి తెలంగాణము వీరి స్వాధీనమందే యుండె ననుటలో నతిశయోక్తి లేదు. దేశమందు సంస్కృతప్రాకృత ములు పర్వియుండినవి. ప్రాకృతము పామరవ్యవహార మందేగాక కవిత్వమునకు నుపయోగపడుచుండెను. శైవవైదికజైనబౌద్ధమతములు చెలరేగి ఆయామతాను యాయులు దేశమందు వాదప్రతివాదము లొనర్చుకొను చుండిరి. తెనుగున కవిత్వము ప్రారంభమైనదిగాని ఇంకను రాజసభల కెక్కలేదు. అందుచే ఆంధ్రుడైన శ్రీకంఠుడు సంస్కృతప్రాకృతములలో కవి యాయెను.

శ్రీకంఠునికి దేశాటనరాజసభాప్రవేశములు చేయవలయు నను తలంపు కలిగినది. వైదికమార్గనిష్ఠు డైనను శైవమతమును అభిమానించెను. బౌద్ధు లనినను ఆతనికి ప్రియమే. ఆంధ్రదేశమందు నాడు శ్రీశైలము నేటివలెనే గొప్ప శైవక్షేత్రము. నేడు తగ్గిపోయినది గాని నాడు ఎచ్చటెచ్చటివారును అచ్చటికి చేరు చుండిరి. పండితప్రకాండుడు శ్రీకంఠుడు పత్నీసమే తుడై మల్లికార్జునస్వామిని దర్శించెను. అచ్చటి పండి తులతోడి వాదములలో పాల్గొని క్రమముగా వారిచే

ప్రేరితుడై బ్రహ్మసూత్రములకు శ్రీకంఠభాష్య మను పేరి శైవభాష్యమును రచించెను. ఉంబ సాయము చేసెను. ఈ భాష్యమే శ్రీశైలవాసులకు, శ్రీకంఠులను పేరి శైవులకు మతగ్రంథ మాయెను. కాని కొందరద్వైతులు శ్రీకంఠుని భాష్యము నాక్షేపింపసాగిరి.

అచటినుండి జయమంగలమున కేగి అక్కను, బావను చూడగోరి శ్రీకంఠుడు సన్నాహమున నుండగా కుమారిలస్వామి దేశాంతర మేగె ననియు, నాయూర వారి కుటుంబము లే దనియు తెలిసినది.

## 3

ఈలో జయమంగల మను గ్రామమున, శ్రీకంఠుని వివాహకాలమున గర్భిణిగా నుండిన శ్రీదేవికి జయమిశ్రు డని యొక కుమారుడు శుభలగ్నమున జనించెను. అం దేమి శుభమోగాని పాప మాయమకు ప్రసవానంతరము వ్యాధి గల్గి మంచమే గతియాయెను. కొంతకాల మట్లుండి ఆయమ గతించెను. కుమారిలుని జీవితమందు అ దొక తటిల్లత. ఆతని యందే అభిమానముంచి, కన్నొకటి పోయినను వివాహము చేసికొని, తమ్ముని వివాహమునకుసయితము పోక తనకడనే యుండి అసువులంబాసిన పత్నికై కుమారిలస్వామి క్రుంగిపోయెను. బాలుని కొంతకాలము తల్లిదండ్రుల సాయముతో పెంచెను. క్రమముగా నాతని తలిదండ్రులును గతించిరి. కుమారుడు ఏడేండ్లవాడైనంతట ఉపనయన మొనరించి తనవెంట దీసికొని బయలుదేరెను. కుమారిలుడు మరల వివాహమాడలేదు. జయమంగలమునకు శ్రీకంఠుడు పోదలంచుటకు కొంతకాలముముందే ఇదెల్ల గడచెను. శ్రీదేవి మరణము శ్రీకంఠునికి తెలియదు.

ఇక కుమారిలుడు జైనమతమును నిర్మూలించుటకు కంకణము కట్టుకొనెను. వేదము స్వతస్సిద్ధమనియు, తదుక్తకర్మమే ఇహపరసుఖప్రద మనియు, కావున వేఱొక డీశ్వరుడు లేడనియు సిద్ధాంతీకరించెను. వెంటనే ప్రచార మారంభించెను. అప్పుడు మేదినీపురము రాజధానిగా నా దేశమును సుధన్వుడను రాజు పాలించుచుండెను. మేదినీపురమే నేటి మిడ్నాపూర్. ఇది ఒరిస్సా బెంగాలుల నడిమిఎల్లలో నున్నది. జైనులు పలువురు ఆ రాజుయొక్క ఆస్థానము చేరి రాజును జైనమతాభిమానిగామాత్రమే కాదు వైదికమతద్వేషిగాసైతము చేసియుండిరి. వైదికకర్మలు దేశమున సన్నగిలియుండెను. రాజమహిషిమాత్రము వైదికమతాభిమాని, విదుషి, భర్తతో వైదికమతప్రాశస్త్యముం గూర్చి వాదించుచుండును. భర్తయొక్క మొండిపట్టుదలకు చాల చింతించి అతనిం ద్రిప్పుటకు మార్గము వెదకుచుండెను.

ఒకనాడు కుమారిలస్వామి మేదినీపురమున కేగి మహారాణియొక్క మేడకు సమీపమున పోవుచుండెను. ఆసమయమున మహారాణి వైదికమతోద్ధరణ మెట్లు జరుగునా యని చింతించుచు నిట్లొక శ్లోకమును చదువ నారంభించెను.

'కిం కరోమి, క్వ గచ్ఛామి, కో వేదా నుద్ధరిష్యతి'

(ఏమి చేయుదును, ఎట కేగుదును, వేదముల నుద్ధరించువా రెవరు?)

ఆ వాక్యములు వినుచుండిన కుమారిలస్వామి వెంటనే సంతోషముతో గగుర్పాటునొంది—

'మా నిషీద వరారోహే, భట్టాచార్యోఽస్మి భూతలే'

(చింతింపకుము తల్లీ, నేనున్నాను భట్టాచార్యుడను.)

ఆ వాక్యములు విని రాణి ఆశ్చర్యపడి కుమారిలుని వెంటనే సౌధమునకు పిలిపించెను. ఆమె యడుగగా నాతడు తన వృత్తాంతమునెల్ల పూర్తిగా వచించెను. ఆతడు తప్పక జైనుల నోడింపగల డనియామె తలంచి ఆతనికి సకలోపచారములును జరుగునట్లు ఏర్పాటులు చేయించి రాజున కెఱింగించెను.

కుమారిలభట్టాచార్యునకు రాజదర్శన మాయెను. అదిమొదలు రాజసభకు వచ్చుచు పోవుచు అతడు వాదార్థము సమయ మెదురుచూచుచుండెను. ఒకప్పుడు రాజసభలో నాత డుండగా కోయిల దూరమున 'కుహూ' అనినది. వెంటనే కుమారిలుడు కోయిల మీది నెపమున నీ శ్లోకమును చదివెను:

"మలినై శ్చే న్న సంగ స్తే నీచైః కాకకులైః పిక
(శ్రుతిదూషకనిర్హ్రా)దైః శ్లాఘనీయ స్తదా భవేః"

ఈ శ్లోకము రాజునకు అన్వయించెను. నీచులగు జైనులచే రాజు పరివృతు డని యాతని భావ మని రాజు గ్రహించెను. ఆతడు మోము చిన్నబుచ్చుకొనెను. మంత్రులు ఉద్వేగము నందిరి. జైనపండితులకు కోపము వచ్చినది. సభాసదులు గుసగుస లారంభించిరి. అప్పు డొక వృద్ధజైనపండితుడు సభవారిని నివారించి రాజుం గాంచి "మహారాజా, జైనమతము దుష్టమనియు, వైదికమతము అత్యుత్తమమైనదనియు ఈ కుమారిలుడు తలంచి ఆ మాటలు పలికినాడు. అందుచే సభయంతయు కలవరము జెందియున్నది. కాబట్టి ఈ రెండు మతధర్మముల గుణావగుణములను వివాదముపై నిర్ణయింపవలసినది." అని కోరెను. మహారాజు సుధన్వు డంగీకరించి ఒకనాడు వాదమున కేర్పాటు చేయించెను.

సభ సమావేశమైనది. ఎచ్చు టెచ్చుటివారును వచ్చి గుమిగూడిరి. ఉభయమతాభిమానులును వచ్చి చేరిరి. అంతవఱ కెచ్చట నుండిరోగాని వైదికమతస్థులు గుంపులుగుంపులుగా వచ్చిరి. తమకు మరల మంచి కాలము వచ్చిన దని తలంచిరి కాబోలు. మహారాజు సింహాసనము నలంకరించెను; మహారాణియు వచ్చి చెంత గూర్చుండెను. పిమ్మట కుమారిలభట్టాచార్యుడును వచ్చి మధ్యవర్తుల నెన్నుకొని జైనులలో శ్రేష్ఠుడగు వానితో వాదమున కారంభించెను. "వేదమునందు చెప్పబడిన కర్మములే ఆచరణీయములు; తద్వ్యతిరేకములు త్యాజ్యములు" అని కుమారిలుడు ప్రతిపాదించి ఉపన్యసించెను. "వేదములు పౌరుషేయములు. అందు జెప్పబడు యజ్ఞాదికర్మలు హింసాత్మకములుకావున వేదకర్మములు ఆచరింపదగనివి. అహింసాత్మకములైన జైనధర్మములే ఆచరణీయములు" అని జైనాచార్యుడు ఖండనోపన్యాసము గావించెను.

అందుమీద వివిధశాస్త్రసంబంధములగు వాదములు ఖండనమండనములతో చెలరేగినవి. ఈవిధముగా కొన్ని దినములు వాదప్రతివాదములు జరుగుచునే యుండినవి. ఉభయపక్షములవారి యిండ్లలోకూడ చిన్న చిన్న సభలు జరుగుచు ఒకరి కొక రాలోచనలు చెప్పుకొనుచుండిరి. కుమారిలభట్టాచార్యుని యుక్తిప్రత్యుక్తులకు ఎల్లవారును ఆశ్చర్యపడుచు జైనేతరులెల్లను ఈతడు సాక్షాత్తు కుమారస్వామియవతారమే యని యనుచుండిరి. తుదకు జైనపండితులెల్ల ఓడిపోయి తమ పరాజయమును ఒప్పుకొనిరి. మధ్యవర్తులు కుమారిలునికే జయపత్రిక నొసగిరి. జైనులనేకు లాతనికి శిష్యులై వైదికమత మవలంబించిరి. సహింపలేనివారు దూరదేశములకు పోయిరి. సుధన్వమహారాజు వైదికమత మవలంబించి రాణిని సంతోషపరచెను. మహారాణి కుమారిలభట్టాచార్యుని విశేషముగా పూజించి సత్కరించెను. తర్వాత నాతడు జైమినిమహర్షి రచించిన పూర్వమీమాంసాసూత్రములకు ఉపవర్షుడు రచించిన వృత్తి ననుసరించి శబరస్వామి రచించిన ధర్మసూత్రభాష్యములను గ్రహించి తంత్రవార్తిక మను పూర్వమీమాంసాగ్రంథమును రచించెను. అతనికి ప్రభాకరభట్టు, పార్థసారథిమిశ్రుడు మొదలైనవారు శిష్యులై ప్రచారము మొదలిడిరి. దూరదేశముల కేగిన జైనులందఱును కుమారిలుడు గురుద్రోహి యని ప్రచారము మొదలిడిరి.

౮

అద్వైతుల బాధ శ్రీకంఠునకు ఎక్కువయాయెను. ఇక శ్రీశైలముకడ నుండరా దని తలంచి యాతడు బయలుదేరెను. ఇంతలో జాతూకర్ణీనీలకంఠులు పరమపదించిరి. పద్మపురమునకు పోవనిచ్చగింపక ఉంబాశ్రీకంఠులు కృష్ణా తుంగభద్రాతీరములను వదలి గోదావరీ తీరముపై పు రెండెడ్లబండిలో నడక సాగించిరి. ఉద్యోగికి దూరదేశ మేది! వేములవాడలో నొక చాళుక్యశాఖ పరిపాలించుచుండెను. కాని వారు జైనులు. ఆ రాజుల యాస్థానమున తన కాశ్రయము లభింపదని తలంచి అట నిలువక అడవులు లోయలు కొండలు దాటి వారు బోదనమునకు పోయిరి. బోదనముకూడ వేములవాడ రాజ్యములోనిదే. అచట వారుండగా గోదావరీతీరమునందలి లక్ష్మణావతీనగరము రాజధానిగా ధర్ముడను రాజు పరిపాలించుచున్నా డనియు, అప్పుడు ఆరాజుసభలో బౌద్ధజైనులకు వాదప్రతివాద

ములు జరుగుచున్నవనియు తెలిసినది. వినోదార్థము శ్రీకంఠుడు సభార్యుడై అచ్చటికి పోయెను.

అప్పుడు అచ్చటి పరిస్థితి—బప్పభట్టి యని యొక పండితుడు మహావిద్వాంసుడు గ్వాలియరును పాలించు చుండిన ఆమరాజునాస్థానమున నుండెను. అచ్చట అతృప్తి జనించి దానిని వదలి దక్షిణదేశమున లక్ష్మణావతికి ఆతడు వచ్చి ధర్మునికి విద్యాగురువై అత్యంత ప్రియుడైయుండెను. బప్పభట్టిని మరల కొనిపోవెంచి ఆమరాజు ధర్మునిమీది కెత్తివచ్చి మోసముగా ప్రమాణము చేయించుకొని బప్పభట్టిని మరల కొని పోయెను. తన పండితుని వదలుట కిష్టము లేకపోయి నను ధర్ముడు దుఃఖముతో బప్పభట్టిని ఆమునికడకు పంపివేసెను. పండితుడును తన హృదయమును లక్ష్మణావతియందే యుంచి శరీరముతోమాత్రము గ్వాలియరు కేగెను.

ధర్ముని హృదయమున ఆమరాజుమీది క్రోధము పోలేదు. ఇట్లుండగా నొకప్పుడు వర్ధమానకుంజరు డను నొక పండితుడు బౌద్ధుడు ధర్మునికడకు వచ్చెను. ఆతని బోధవలన ధర్ముడు బౌద్ధుడై తన శత్రువునకు ఆమరాజు నకు జాబువ్రాసెను. 'నీవు మాకు శత్రువర్గములోని వాడవు. నా పండితుని బప్పభట్టిని హరించినావు. ఇప్పుడు మన మిరువురమును యుద్ధమొనరించి జీవ హాని చేయుటకన్న ధర్మమార్గమున పందెమువేయు దము. మాకడ నొక బౌద్ధపండితుడు కలడు. ఆయనతో సమానముగా వాదించువా డుండిన పంపుము. నీ పండి తుడు ఓడిపోయిన నీ రాజ్యము నాది. నా పండితుడు ఓడిన నా రాజ్యము నీది.'

ఆమరాజు బప్పభట్టిని పిలుచుకొని లక్ష్మణావతికి వచ్చెను. ఆ పండితుల కిరువురకును వాక్కలహము ప్రారంభమాయెను. మధ్యవర్తిగా వారిరువురును వాక్పతిరాజును ఎన్నుకొనిరి. ఈతడు క్షత్రియుడు, పరమారవంశస్థుడు, మహాపండితుడు. ధర్మునికి సామంతుడు. వైదికమతస్థుడు. అట్టి సమయమున ఉంబయు, శ్రీకంఠుడును రాజసభాప్రవేశ మొనరించి వాదములను వినుచుండిరి.

వర్ధమానకుంజర బప్పభట్టినూరులు ఒకరి కొకరు తీసిపోక ఆఱు నెలలు వాదించిరి. వాదములు ఒకప్పటికి ముగియునట్లు లేదు. ఆమరాజు తన కార్యములకు భంగ మగుచున్నదని బప్పభట్టిని హెచ్చరించెను. ఆతడు తన యుపాసనా దేవతయగు సరస్వతీదేవిని ప్రత్యక్షీకరించు కొని ప్రార్థించెను. ఆమె యిట్లనియె—'అబ్బాయీ, బౌద్ధుని నోట అక్షయవచనగుటిక యని యొకటి ఉన్నది. దానిప్రభావమున నతడు అంత వాగ్మిగా నున్నాడు. దానిని అతనికి పూర్వము నేనే ఇచ్చితిని. నీ వాతని జయింపగోరిన నతని నోటిని కడిగించి వాదమునకు పిలువుము' అనెను.

రహస్యము గ్రహించి బప్పభట్టి తన పూర్వపరిచితునికి వాక్పతికి ఇట్లు చెప్పిపంపెను: 'పూర్వపరిచయము ననుసరించి నీవు నా కొక ఉపకారమును చేయవలయును. నీవును మునుపు వాగ్దాన మొనర్చి యున్నావు. నేడు తరుణము వచ్చినది. రేపు వాదమునకు ప్రారంభించుటకుముందు మమ్మిరువురను నోళ్లను కడిగికొనుట కాజ్ఞాపింపుము.' వాక్పతిరాజు పూర్వము బప్పభట్టి అచ్చట నుండగా నట్టి వాగ్దాన మొనర్చియుండెను. కాన నొప్పుకొనెను. ఇందలి మర్మము నాతడు గ్రహింపలేదు. వాదార్థము వాదు లిరువురును గూర్చుండగానే, తాను మధ్యవర్తిగాన, నిరువురను పుక్కిలించిరండని వాక్పతిరాజు ఆజ్ఞాపించెను. వెంటనే వా రట్లు చేసిరి. బౌద్ధుని నోటి గుళిక రాలిపోయెను. నా డాతడు ఓడిపోయెను. ఒప్పుకొనిన ప్రకారము ధర్ముడు తన రాజ్యమును ఆమున కొసంగెను. బప్పభట్టియొక్క ప్రార్థనమీద ఆముడు మరల ఆ రాజ్యమును ధర్మునికే ఇచ్చివేసెను. తత్క్షణమే గ్వాలియరుకు వెడలిపోయెను.

ఈ సందర్భమున శ్రీకంఠునికి బౌద్ధాభిమానము దృఢపడెను. వాక్పతిరాజు తొలుత మిత్రుడై తర్వాత శిష్యు డాయెను. వాదమున నోడిపోయిన వర్ధమానకుంజరుడు ధర్మునితో వాక్పతి ద్రోహ మొనర్చెనని ఫిర్యాదు చేసెను. ధర్మునికి కోపము వచ్చినది. శ్రీకంఠుడు వాక్పతికి ఆ కిటుకు తెలియదనియు, నాత డొనర్చిన సేవచే క్షమింపదగుననియు రాజును ప్రార్థించి వాక్పతిరాజును క్షమింపించెను.

౫

తర్వాత కొన్నాళ్లకు కన్యాకుబ్జమునకు యశోవర్మ ప్రభువాయెను. ఎనిమిదవ శతాబ్దప్రారంభ కాలమునకు రాజాధిరాజును, మహాకవియు, నాటకకర్తయు నైన కవిబంధువు శ్రీహర్ష దేవుడు గతించి దాదాపు అరువదిసంవత్సరములై యుండెను. బాణమయూరాది కవులు గతించి చాలకాలము కాలేదు. కన్యాకుబ్జము శ్రీహర్షునియనంతరము పలువురు సాహసికులచేత బడి శ్రీకంఠుని కాలమునకు యశోవర్మపాలనమునకు వచ్చెను. కన్యాకుబ్జము గంగానదీతీరమున నేటి ఢిల్లీ నగరమునకు దాదాపు రెండువందలమైళ్లు ఉత్తరమున నున్నది. దానికి దక్షిణమున దాదాపు నూరుమైళ్ళ దూరమున యమునానదీదక్షిణతీరమున కాలప్రియ మను సుప్రసిద్ధక్షేత్రము కలదు. ఈ క్షేత్రము నాడు మహోన్నతస్థితియం దుండెను. రాష్ట్రకూట రాజులును కొందఱు ఇచ్చట యుద్ధ మొనరించియున్నారు. యశోవర్మమహారాజు కన్యాకుబ్జమును వదలి కాలప్రియనాథ క్షేత్రమును తనకు రాజధానిగా చేసికొనెను. (ఈప్రదేశమే నేడు కాల్పియనబడుచున్నది.) ఇట్లు చేయుటచేత అతనికి పశ్చిమమునుండి దండెత్తివచ్చునట్టి కాశ్మీరప్రభువు లలితాదిత్యముక్తాపీడుని బాధ తప్పెను.

ఈ యశోవర్మ చంద్రవంశసంజాతుడని యొకరును, మౌర్యసామ్రాట్టు చంద్రగుప్తుని వంశీకుడని జైనులును తెలుపుచున్నారు. యశోవర్మ మహాజేత. దేశాంతరములతో వాణిజ్యవిద్యాసంపర్కములు గలవాడు. దూరదేశమైనను చైనాకు రాయబారమంపెను. బహుశః అతని యుద్దేశము తన సామ్రాజ్యమునకు, చైనాదేశమునకును నడుమ నుండు శత్రువులు తనపై నెత్తివచ్చినయెడల వారిని వెనుకనుండు చీనావారు కొట్టవలయునని యుండును. ఈ రాయబారము క్రీ. శ. ౭౩౧ లో జరిగినట్లు చైనీయుల గ్రంథములలో గలదు. కన్యాకుబ్జాధీశుడైన ఇ-ఛ-పక్-మొ (యశోవర్మ) తన మంత్రియైన సెంగ్-పో-త (?) అనువానిని చీనాకు పంపియుండెను.

యశోవర్మ ఉత్తరదిక్కున నాపద రానీయక కాపాడుకొని దిగ్విజయ మారంభించెను. వర్షావిరామ సుభగమైన శరదృతువులో బయలుదేరెను. చల్లని మలయమారుతము వీవసాగెను. ఎచ్చటినుండియో పుష్పవాన కురిసినది. పౌరాంగనలు మహారాజదర్శనోత్సుకలై కిటికీలకడకు వచ్చి చూడసాగిరి. కవులు వందులు సంగీతవిద్వాంసులును తమ కవిత్వస్తోత్రగానములచే రాజు నాశీర్వదించిరి. అతడు క్రమముగా తన రాష్ట్రమును వదలి సర్ణానదీతీరభూములకు వచ్చెను. ఇంతిలో చలికాలమును వచ్చెను. అటనుండి యాతడు వింధ్యారణ్యముంజొచ్చి వింధ్యవాసినింగనెను. మహాదేవిని పూజించి బయలుదేరెను. వర్షాకాలము ప్రారంభమాయెను. వింధ్యవాసిన్యాలయము నేటి యు. పి. రాష్ట్రమున మీర్జాపురమున నున్నది. మగధాధిపుడు యశోవర్మయొక్క సేనాసమూహముం గని పారిపోదలంచెనుగాని ధైర్యము తెచ్చుకొని ఎదుర్కొనెను. అతని సామంతులును ఎదిరించిరి. మగధాధిపునే గౌడుడని కొందఱు కవులు వ్రాసియున్నారు. మహాయుద్ధము సాగగా యశోవర్మ గౌడరాజును రణరంగమున తాకి నఱికెను. అటనుండి బయలుదేరి ఏలాసుగంధభూయిష్ఠంబగు సముద్రతీరభూములకు పోయెను. తర్వాత వంగదేశమునకు పోయి దానిని జయించి అటనుండి లెక్కలేని ఏనుగులను గ్రహించి తర్వాత దక్షిణమునందలి సహ్యపర్వతములకు వచ్చి అచ్చట నొక రాజును జయించెను. తర్వాత పారసీకులను జయించి కవేరులను జయించెను. అటనుండి బయలుదేరిగోదావరీ తీరమునందలి రాజులను జయించుచుక్రమమున లక్ష్మణావతికి వచ్చి ధర్మని జయించెను. ధర్మని సేనాపతిగా వాక్పతిరాజు ఎదిరింపగా నతనిని పట్టి చెఱవైచెను. అటనుండి పశ్చిమమునకు మరలి పర్వతదుర్గమ ప్రదేశములను జయించి నర్మదానదిని దాటి మరు (మార్వాడి) దేశము చొచ్చి శ్రీహర్షమహారాజుచే పావనమైన చరిత్రప్రసిద్ధ శ్రీకంఠదేశమునకు వచ్చెను. అచటినుండి హరిశ్చంద్రునిచే పవిత్రీకృతమైన అయోధ్యానగరమునకు వచ్చి, రాజుల కానుకలు గ్రహించి, దేవదారువృక్షముల రసములచే పరిమళవంతమైన హిమాలయ భాగములను కూడ జయించి తన రాజధానికి మరలెను. తాను ముఖ్యముగా జయించిన మగధదేశమందు రణరంగమున యశోవర్మపుర మని యొక నగరమును నిర్మించెను. (సశేషము)